ఇళ్లలో బేళ్లు.. రైతుకు కన్నీళ్లు..

- మందకొడిగా పొగాకు వేలం
- నిత్యం 300పైగా బేళ్లు తిరస్కరణ
- ఏడో రౌండ్ ముగిసే నాటికి కొనుగోళ్లు చేసింది కేవలం 7.5 మిలియన్లు
- రైతుల వద్ద ఇంకా 11 మిలియన్ల కేజీల పొగాకు
- లో గ్రేడ్ కొనుగోలు చేస్తారా లేదా అని రైతుల ఆందోళన

కొండపి:

ఒకటి..రెండు...మూడు..ఇలా ఏడు రౌండ్ల పొగాకు వేలం పూర్తయింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పొగాకు సాగు చేసి ఎంతో ఆశతో వేలానికి తీసుకువస్తున్న రైతులకు చివరకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రౌండ్ రౌండ్‌కు ఓ పక్క ధరలు పతనమవుతుంటే..మరో పక్క రోజు రోజుకు వ్యాపారులు తిరస్కరించే బేళ్లు పెరిగిపోతున్నాయి. పొగాకు బోర్డు చరిత్రలో ఒకే రోజు ఇన్ని వందల బేళ్లు తిరస్కరించిన దాఖలాలు గతంలో లేవు. నిత్యం వందల సంఖ్యలో తిరస్కరిస్తున్న బేళ్లను చూసిన రైతులు..అసలు వ్యాపారులకు పొగాకు కొనుగోలు చేసే ఉద్దేశం ఉందా లేదా అని చర్చించుకుంటున్నారు.

ఏడు రౌండ్లు వేలం ముగిసినా..

కొండపి పొగాకు బోర్డు పరిధిలో 12 మిలియన్ కేజీల పొగాకు సాగుకు బోర్డు అనుమతించింది. అయితే గత ఏడాది పొగాకు సాగులో వచ్చిన లాభాల నేపథ్యంలో రైతులు 18.38 మిలియన్ కేజీల పొగాకును పండించారు. అయితే మార్చి 10వ తేదీన ప్రారంభమైన వేలం నాలుగు నెలలు దాటినా ఇంత వరకు రైతుల వద్ద కేవలం 7.53 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే కొనుగోలు చేశారు. రైతుల వద్ద ఇంకా 12 మిలియన్ల కేజీల పొగాకు మూలుగుతోంది. రోజు రోజుకు పతనమవుతున్న ధరల నేపథ్యంలోరైతులు కొంత మంది బేళ్లను శీతల గిడ్డంగుల్లో భద్రపరుచుకుంటున్నారు. మరికొంత మంది రైతులు ఇళ్లలోనే బేళ్లను పెట్టుకొని ఏం చేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఇప్పటికే వేలానికి తీసుకువచ్చి తిరస్కరణకు గురికావడంతో ఒకటికి రెండుసార్లు తీసుకోచ్చిన బేళ్లను అధిక భాగం దెబ్బతిన్నాయి. అసలు లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేసే ఉద్దేశం వ్యాపారులకు ఉందా లేదా మీమాంస రైతుల్లో నెలకొంది.



ఏడో రౌండ్ ప్రారంభంలో మద్దతు ధర కోసం రోడ్డెక్కిన రైతులు(ఫైల్)

మూడు రోజుల్లో వెయ్యి బేళ్ల తిరస్కరణ

బోర్డు పరిధిలో ఏడో రౌండ్ ప్రారంభం నుంచి అధిక సంఖ్యలో బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. అయితే ఏడో రౌండ్ వరకు రోజుకు 200 పైగా బేళ్లు తిరస్కరణకు గురి కాగా 8వ రౌండ్ వేలం ప్రారంభం నుంచి నిత్యం 300కు పైగా బేళ్లను వ్యాపారులు తిరస్కరిస్తున్నారు. మూడు రోజుల్లో సుమారు వెయ్యి బేళ్లను వ్యాపారులు తిరస్కరించడంతో రైతులు దిగాలుగా వాటిని ఇంటికి తీసుకువెళ్లారు. అసలే పీకల్లోతు నష్టాల్లో ఉంటే ఈ తిరస్కరణ బేళ్లతో అధిక వ్యయప్రయాసలకు లోనవుతున్నామని పొగాకు రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఏడో రౌండ్ ప్రారంభంలోనే తిరస్కరణ బేళ్లపై రైతులు రోడ్డెక్కారు. అయితే అధికారులు రైతులతో చర్చించి కొనుగోలు చేస్తామనిహామీ ఇచ్చి వేలాన్ని ప్రారంభించారు. అయితే హామీ కేవలం మాటలకు పరిమితమైందని రైతులు వాపోతున్నారు.

రైతు నెత్తిన మరో పిడుగు

పొగాకు రైతుకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే బేళ్ల తిరస్కరణ పిడుగుపాటులాగా తయారైంది. గత సంవత్సరం కేజీ 360 రూపాయలు పలికిన పొగాకు నేడు కేవలం 240కు పరిమితం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక సంఖ్యలో అప్పులు తీసుకొని వచ్చి పొగాకు పెట్టుబడి పెట్టడంతో గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు కూలీల నుంచి డబ్బులు డిమాండ్ మరొకవైపు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారు. ఇటువంటి పరిస్థితులలో బేలు తిరస్కరణతో అదనపు పెట్టుబడి పెట్టవలసి వస్తుందని రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో నిల్వచేసిన బేళ్లను ఎన్నిసార్లు వేయడానికి తీసుకొని వచ్చి ఎన్నిసార్లు ఇంటికి తీసుకువెళ్లాలో అర్థం కావడం లేదని గిట్టుబాటు ధర కల్పించి బేళ్లను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.

అన్ని బేళ్లను కొనుగోలు చేయాలి



వేలానికి తీసుకువచ్చిన అన్ని పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయాలి. రోజుకు 300 బేళ్లను వ్యాపారులు తిరస్కరిస్తున్నారు. వాటిని తిరిగి ఇంటికి తీసుకువెళ్లాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నాం. మా గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి పొగాకు రైతులను ఆదుకోవాలి.

– సురేష్, పొగాకు రైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



పొగాకు రైతులకు ప్రభుత్వం వెంటనే స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలి. బ్యారన్‌కు రూ.2 లక్షల వరకు నష్టం వస్తుంది. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపితే ధరల్లో మార్పు వస్తుంది. కానీ ప్రభుత్వం ఆ విధంగా చేయడం లేదు. గత ప్రభుత్వంలో పొగాకు రైతులకు మంచి లాభాలు వచ్చాయి.

– పర్చూరి శ్రీను రైతు

రోడ్డెక్కిన రైతులు కనికరించని ప్రభుత్వం

గిట్టుబాటు ధర కల్పించాలని వేలానికి తీసుకొని వచ్చిన అన్ని బెలను కొనుగోలు చేయాలని కేంద్రంలో రైతులు దాదాపు నాలుగు సార్లు రోడ్ ఎక్కారు. రైతుల రోడ్డెక్కి ధర్నా చేసే సమయంలో అధికారులు వ్యాపారులతో చర్చించి అన్ని బేలు కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీలు మాత్రమే ఇచ్చారని ఆ తర్వాత హామీలు నిలబెట్టుకోవడంలో అధికారుల విఫలమయ్యారన్నారు. ఇంత జరుగుతున్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా రా ప్రభుత్వాలు స్పందించి మార్క్ ఫేడ్ ను రంగంలో దించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన చిట్యాల



హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఐటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి బుధవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

కొండపి: వైఎస్సార్ సీపీ మండల విస్తృత సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలి రోడ్డులోని గుడిపల్లి చందుకల్యాణ మండపం వెనుక నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం సాయంత్రం ప్రారంభిస్తారన్నారు. అనంతరం మండలస్థాయి విస్తృత సమావేశం, బాబు షూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాలను పార్టీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లుతెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

52 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ వైద్య పరీక్షల్లో భాగంగా బుధవారం పెద్ద దాసళ్లపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరంలో 52 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

బాబా ఆలయానికి రూ.2 లక్షల విరాళం

పామూరు: స్థానిక పోస్టాఫీస్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయానికి నెల్లూరుకు చెందిన డాక్టర్ ఓగిరాల గోపాలకృష్ణ, అంజని దంపతులు రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం వారి వైద్యశాలలో విరాళం నగదు రూ.2 లక్షలు ఆలయ చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్యకు దాత డాక్టర్ ఓగిరాల గోపాలకృష్ణ అందజేశారు.

వాహనదారులకు కౌన్సెలింగ్



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

టంగుటూరు: ద్విచక్రవాహనాలకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడితే చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగమల్లేశ్వరరావు అన్నారు. టంగుటూరులో ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లకు పెద్ద సౌండ్ వచ్చేలా మార్చి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ద్విచక్రవాహనాలను పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైలెన్సర్లను మారిస్తే వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

బిందు, తుంపర సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



పూలమొక్కలు నాటుతున్న ఉద్యానవన కళాశాల విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు): మెట్టప్రాంతాలకు బిందు, తుంపర సేద్యం ఎంతో లాభదాయకమని కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్ అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాల విద్యార్థులు బిందు సేద్యం ద్వారా నీటిని ఆదా చేస్తూ పూలతోటల పెంపకం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పూలతోటల సాగులో చామంతి మొక్కలు నాటారు. గ్రామీణప్రాంతాల రైతుసోదరులకు క్షేత్ర ప్రదర్శనద్వారా వారికికూడా అవగాహన చేయడం జరుగుతుందని డీన్ వీరన్నగౌడ్ తెలిపారు.

దళిత కాలనీలకు రామతీర్థం నీరు వదలరా..?

టంగుటూరు: దళిత కాలనీలకు రామతీర్థం నీరు ఇవ్వకుండా కేవలం ఉప్పునీరు వదులుతున్నారని ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన అధికారులను నిలదీశారు. నెలకు ఒకసారి కూడా రామతీర్థం నీరు వదలడం లేదని, కేవలం రోజు మార్చి రోజు ఉప్పు నీరు వదులుతున్నారన్నారు. కేవలం దళితులమనే చులకనభావంతో అధికారులు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్ల పైకి పారుతున్నాయని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయాడు.

ఖాజావలి మృతి పార్టీకి తీరని లోటు



పామూరు: వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకుడు షేక్.ఎ(ర)ఖాజావలి మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మోపాడు గ్రామానికి చెందిన షేక్.ఎ(ర)ఖాజావలి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈసందర్భంగా బుధవారం ఆయన నివాసానికి వెళ్లిన పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పలువురు మృతుని భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముస్లిం మైనారిటీ నాయకులు ఎంఎటీ నాయబ్‌రసూల్, మచ్చ బాషా, నాయబ్‌రసూల్, షావుల్ పలువురు ఉన్నారు.

కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేస్తున్న సీడీపీఓ సరోజిని

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.సరోజిని అన్నారు. మండలంలోని గోపాలపురం, ఇస్లాంపేట, నుచ్చుపొద అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. కేంద్రంలో ఉన్న పిల్లలకు హాజరుకు పొంతన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలను నిర్వీర్యం చేస్తున్న పాలకులు



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కనిగిరిరూరల్: కష్టజీవుల, కార్మికుల హక్కులను, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ కనీస వేతన చట్టం, భూ సంస్కరణల చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఉపాధి హామీ లాంటి అనేక చట్టాలు పోరాటాల ద్వారానే సాధించుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 17వ మహాసభలను వచ్చే నెల 12, 13 తేదీల్లో కనిగిరిలో జరుగుతాయన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ కార్మిక, కర్షకలు ఐక్యతతోనే అసమానతలు లేని సమానత్వ వ్యవస్థ సాధ్యమవుతుందన్నారు. కనిగిరి ప్రాంతంలో పరిశ్రమలు, ప్రాజెక్టులు నిర్మాణం లేకే నేటికీ వలసలు కొనసాగుతున్నాయన్నారు. వివిధ సంఘాల నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, పీసీ కేశవరావు, పిల్లి తిప్పారెడ్డి, రాయళ్ల మాలకొండయ్య, వి.మాలకొండారెడ్డి, యు రాజ్యలక్ష్మి, కె.ప్రసన్న, కె.మాల్యాద్రి, మహేష్, పాండు, కె.యోబు, వై వీర నారాయణ, జి.శ్రీనివాసులరెడ్డి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట సర్వే నిర్వహించాలి



బీఎల్‌ఓలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కొండపి: ఒక కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే బూతులో ఉండేలా బీఎల్వోలు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి అవకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బీఎల్‌ఓలకు శిక్షణ నిర్వహించారు. శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన ఏ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రతి బ్యాచ్‌కు 50 మంది చొప్పున కొండపిలో ఆరో బ్యాచ్‌కు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంటినీ సర్వే చేసి చనిపోయిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు, పర్మినెంట్‌గా ఇళ్లు మారిన వారి ఓట్ల వివరాలను సేకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడకుండా డోర్ టు డోర్ సర్వే చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాను ఏ విధంగా తయారు చేయాలో సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న బీఎల్ఓలకు సర్టిఫికెట్ల అందజేశారు. తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వి. బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దద్దాల నారాయణకు సన్మానం



దద్దాల నారాయణను సన్మానిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షునిగా నియమితులైన దిరిశవంచకు చెందిన గుంటూరి వెంకటేశ్వర్లు, గ్రామ కార్యకర్తలు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో దద్దాల నారాయణ, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను పార్టీ శ్రేణులంతా సమష్టిగా కలిసి ప్రశ్నించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం దద్దాల నారాయణ యాదవ్, కస్తూరిరెడ్డి, పార్టీ నేతలు పార్టీ మండల ఉపాధ్యక్షుడు గుంటూరి వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్ర మంలో బత్తుల మాలీ యాదవ్, గుంటూరి రమేష్ చౌదరి, రావి సుబ్బారావు చౌదరి, చందు బ్రహ్మయ్య, పొదిలి వెంకటేశ్వర్లు, చందు, ప్రతాప్, కోలా రవి, సురేంద్ర పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కనిగిరిరూరల్:

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలని, మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించాలని, సంక్రాంతి కానుకలు, పనిముట్లు, దుస్తులు అందచేయాలని, చనిపోయిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్మికులు సమ్మె చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చార్లస్, లక్ష్మయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిఖర్చులకు రూ.25 వేలు అందజేత

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని వి.బైలు వీఆర్‌ఏగా పనిచేస్తున్న పఠాన్ పీర్ సాహెబ్ (85) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ వీఆర్‌ఏ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మట్టి ఖర్చుల కింద రూ.25 వేలను మృతుని భార్య కాశింబీకి అందజేశారు.



ఆర్థికసాయం నగదు అందజేస్తున్న తహసీల్దార్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ

హనుమంతునిపాడు: యాజమాన్య పద్ధతుల్లో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ అన్నారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో విత్తనశుద్ధి, భూసార పరీక్షలు, కంది, మినుము, అలసంద, విత్తనంవేసే దగ్గర నుంచి పంట కోత వరకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఏఓ వి.రవికుమార్, వీఏఏ భరత్, ఏఈఓ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న జడ్జి రూపశ్రీ

కనిగిరిరూరల్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం అనే అంశంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బి. రూపశ్రీ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారానే సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల 10 నుంచి 16వ తేదీవరకు మధ్యవర్తిత్వ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. న్యాయ సహాయం కోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ టోల్ ఫ్రీ నంబర్ 15100కు సంప్రదించాలని తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, డోర్‌టు డోర్, బస్టాండ్‌లలో, ప్రధాన కూడళ్లలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌కే ఖాజావలి, న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు, పారాలీగల్ వలంటీర్లు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, మహిళా పోలీస్‌లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

281 పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం జరిగిన వేలంలో 690 పొగాకు బేళ్లు కొనుగోలు చేశారు. పొందూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 971 బేళ్లను తీసుకురాగా 690 బేళ్లను కొనుగోలు చేసి 281 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధరరూ.160, సరాసరి ధర రూ.205.37గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలోని పదో వార్డులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ దాసరి మురళీ కృష్ణతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు. పైప్ లైన్ లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయాలని, విద్యుత్ సమస్యలపై స్పందించి చర్యలు చేపట్టాలని మున్సిపల్, సచివాలయ సిబ్బందికి సూచించారు. మున్సిపల్ ఏఈ మాధవరావు, సచివాలయ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



బాల్య వివాహంపై కౌన్సెలింగ్ ఇస్తున్న సీడీపీఓ

పామూరు: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ కనిగిరి సీడీపీఓ పి.సరోజిని అన్నారు. మండలంలోని పాబోలువారిపల్లెలో బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారంతో వారి నివాసానికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాలు చేస్తే శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. మండలంలో ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎన్‌జీఓ నాయబ్‌రసూల్, మహిళాపోలీస్ హరిత, కార్యకర్త పాల్గొన్నారు.

ఘనంగా క్లా దొర జయంతి వేడుకలు

వీసీపల్లి: మండల పరిధిలోని పాలకొండపాడు ఎస్సీ కాలనీలో క్లా ద్వారా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల పేరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దుస్తులు పంపిణీ చేశారు. తీయల ప్రేమ్ చంద్రరావు, డాక్టర్ రాజ్ విమల్ గుర్రాల, రంజిత్ అమ్మ, జాన్ ఎడిసన్, గూడూరి ప్రశాంత్, కుకట్లపల్లి ప్రసన్న, రంగీవరపు జాన్ పాల్గొన్నారు.

నిపుణ్ భారత్ లక్ష్యాలు సాధించాలి

సీఎస్‌పురం(పామూరు): నిపుణ్ భారత్ లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం ఎస్టీకాలనీ పాఠశాల, ఆరెపాలెం పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలలో వెనుకబడిన పిల్లలకోసం ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన రెమిడియల్ బోధనను అనుసరించాలని సూచించారు. 1, 2 తరగతుల విద్యార్థులకోసం 45 రోజులు, 3, 5 తరగతుల విద్యార్థులకోసం 30 రోజులు, 6వ తరగతి విద్యార్థులకోసం 40 రోజులపాటు స్కూల్ రెడీనెస్ కార్యక్రమం అమలుచేయాల్సి ఉందన్నారు. హెచ్‌ఎం ఆంటోని, సీఆర్‌పి వి.సతీష్‌కుమార్ ఉన్నారు.